క్లుప్తంగా

30 మందికి వైద్యపరీక్షలు

వరికుంటపాడు : మండలంలోని గణేశ్వరపురంలో 104 వాహన సేవలను సోమవారం అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా 30 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలోని యాదవవీధి, వసతి గృహ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి రావి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రమీలకు సోమవారం ఆయన వినతి పత్రం అందజేశారు. యాదవవీధి మధ్యలో 150 మీటర్ల దూరం రోడ్డు కుంగిపోయి ఉందన్నారు. దీంతో చిన్నపాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఈ వీధిలో నిత్యం రాకపోకలు సాగించే ఉన్నత పాఠశాల విద్యార్థులు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వసతిగృహం రోడ్డులోనూ వంద అడుగుల దూరం నీరు నిల్వ ఉంటుండడంతో ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ఆయన వెంట సీపీఎం నాయకులు ఆంథోని బాబు, గడ్డం మాల్యాద్రి, తదితరులు ఉన్నారు.

పశుగణనపై శిక్షణ

వరికుంటపాడు : దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు సంబంధించిన పశుసంవర్ధక శాఖ సహాయకులకు దుత్తలూరు ప్రాంతీయ పశువైద్యశాలలో పశుగణనపై సోమవారం శిక్షణ ఇచ్చారు. పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే సిబ్బంది ఇంటింటిని సందర్శించి పశువులు, జీవాలు, కోళ్లు, తదితర మూగ జీవాలను నమోదు చేయాలని సూచించారు.

కావలిలో టిడ్కో చైర్మన్



కావలి: రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సోమవారం విజయవాడ వెళ్తూ కావలిలో కొద్దిసేపు ఆగారు. ఆయన్ని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య, కావలి పట్టణ ఉపాధ్యక్షుడు గాదంశెట్టి రవి, నాయకులు తోకల వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వరరావు, జ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు.

గిరిజనులకు అన్నదానం



కావలి: పట్టణంలోని బుడంగుంట గిరిజన కాలనీలో తుఫాన్‌నగర్‌కు చెందిన పాదిల వాసుదేవరావు, వరలక్ష్మి దంపతులు సోమవారం అన్నదానం చేశారు. తమ కుమారుడు, కోడలు కిషోర్‌కుమార్, తేజస్విని పెళ్లిరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

ఆక్రమణల తొలగింపు



కావలి: పట్టణంలోని ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ట్రంక్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ప్రహరీని అనుకుని ట్రంకురోడ్డును ఆక్రమించి కొందరు బంకులు పెట్టుకుని పందిర్లు వేసుకున్నారు. ఇవి ట్రాఫిక్‌కు అవరోధంగా మారిన క్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి వివేక్ ఆధ్వర్యంలో తొలగించారు.

మానవ కంప్యూటర్ శకుంతలాదేవి



సోమశిల: శకుంతలాదేవి గణితంలో అసాధారణ ప్రజ్ఞ కలిగి మానవ కంప్యూటర్‌గా కీర్తింపబడ్డారని గణిత ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర రెడ్డి, కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం చిలకలమర్రి హైస్కూల్‌లో గణిత మేధావి శకుంతలాదేవి జయంతిని సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు మహేష్, రమణరాజు, మదీనా, మాధవి, సురేష్ పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

వింజమూరు(ఉదయగిరి): పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులైన సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని వింజమూరు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వింజమూరులోని స్త్రీశక్తి భవనంలో సోమవారం నిర్వహించిన ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యతోనే ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని తెలిపారు. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, న్యాయ సలహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎం కృష్ణారావు, ఇతర శాఖల అధికారులు సుజాత, షకీలా, ఎస్కే బాదుల్లా, సుశీల, కే విజయమ్మ పాల్గొన్నారు.

రీచార్జి చేసుకో..పవర్ వాడుకో

- బిల్లుల స్థానంలో..ప్రీపెయిడ్ విధానం
- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ సంస్థ చర్యలు
- తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- ఇప్పటికే 411 స్మార్ట్ మీటర్లను అమర్చి పనితీరు పరిశీలన

కావలి: విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్‌లోకి మారనుంది. ఇక ముందస్తుగా రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా ఉంటుంది. రీచార్జి మొత్తం అయిపోగానే సరఫరా ఆటోమెటిక్‌గా నిలిచిపోతోంది. ఆ దిశగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను విద్యుత్‌శాఖ తీసుకొస్తోంది. ఇప్పటికే పట్టణంలో స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వచ్చేశాయి. తొలి విడతగా వీటిని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. గత నెల రోజుల వ్యవధిలో పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా 411 స్మార్ట్ మీటర్లను అమర్చి వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. రెండో విడతగా వాణిజ్య సముదాయాల్లో కూడా వీటిని బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఆ తర్వాత గృహ సముదాయాలు, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయానికి ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలో 37వేల గృహ, మరో



మున్సిపాలిటీ వీధిదీపాలకు బిగించిన స్మార్ట్‌మీటర్

3వేలు కమర్షియల్, 500 పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ నెల వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి వినియోగదారులు మరుసటి నెలలో బిల్లు చెల్లిస్తున్నారు. ప్రతినెలా మొదటి వారంలో మీటర్ రీడర్ బిల్లు తీస్తే చెల్లించేందుకు పదిహేను రోజుల గడువు ఉంటుంది. ఆ తరువాత కూడా అపరాధ రుసుంతో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తారు. అప్పటికీ చెల్లించకపోతే కనెక్షన్‌ను తొలగిస్తారు. ఈ విధానంలో బకాయిలు కోట్లలో పేరుకుపోయి విద్యుత్ పంపిణీ సంస్థలపై భారం పడుతోంది.

స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నాం

ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను విద్యుత్‌శాఖ తీసుకొస్తోంది. తొలుత పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా స్మార్ట్ మీటర్లను అమర్చాం. ఆ తర్వాత వాణిజ్య కనెక్షన్లు, గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నాం.

– వై వసంతరావు, విద్యుత్ శాఖ జేఈ, , కావలి టౌన్

దీని నుంచి ఉపశమనానికి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ సంస్థ సిద్ధమవుతోంది. స్మార్ విధానంలో వినియోగదారులు ముందుగా విద్యుత్ వినియోగం మేరకు రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ ఉన్నంత వరకు నిర్విరామంగా విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ విధానంలో ఎంత విద్యుత్‌ను వినియోగించామో, ఇంకా ఎంత బ్యాలెన్సు ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తీసుకురానున్నారు. ఈ యాప్‌ను వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పరిశీలించుకోవచ్చు. నగదు అయిపోయిన వెంటనే మళ్లీ నగదు చెల్లించి రీచార్జి చేసుకుంటే విద్యుత్ సరఫరా కొనసాగుతుంది.

రైతుల సమస్యల పరిష్కారానికి ఆందోళన

ఉదయగిరి: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బండగానిపల్లి పంచాయతీ పరిధిలోని పలువురు రైతులకు భూ పట్టాలు అందజేయగా బ్యాంకుల్లో రుణాలు తీసుకుని పంటలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో భూములకు సంబంధించి 1బీ, అడంగల్ రాకపోవడమే కాకుండా రైతు వ్యక్తిగత ఖాతాలకు బదులుగా నోషనల్ ఖాతాలు ఉండడంతో బ్యాంకుల్లో రుణాలను రెన్యువల్ చేసుకునే అవకాశం



ఆందోళన చేస్తున్న రైతులు

లేకుండా పోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘ నాయకులు తిరుపతయ్య, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి

కావలి: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కావలి లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా కావలి రూరల్ మండలం గౌరవరంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆవరణలో ఖాతాదారులకు అవినీతి నియంత్రణపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవినీతి నియంత్రణపై కరపత్రాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ అవినీతి దేశ ప్రగతికి అవరోధమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యపరిచి అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అవినీతి నిరోధక చట్టా



ఖాతాదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బ్యాంకు సిబ్బంది

లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ రత్నకుమారి, ఫీల్డ్‌ఆఫీసర్ ప్రవళిక, జోసఫ్ కుమార్, కే సాగర్, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల గర్జన

అల్లూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అల్లూరులో మాలల గర్జన ర్యాలీని సోమవారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మాన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలు, మాదిగల నడుమ చిచ్చుపెట్టి అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు. దీనిపై మాలలను చైతన్యవంతం చేసి ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఉద్యమాన్ని



మాట్లాడుతున్న ఎల్లు సాల్మాన్ రాజు

తీవ్రతరం చేస్తామన్నారు. మాలల జేఏసీ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, నాయకులు కే సింహాద్రి, ఏ కొండలరావు, పీ సుధాకర్, డీ మాల్యాద్రి, ఎం నరేంద్ర, జీ సతీష్, కమలాకర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

మర్రిపాడు: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించి రైతులకు బిల్లులను తప్పనిసరిగా ఇవ్వాలని వింజమూరు ఏడీఏ ఎస్ రామిరెడ్డి డీలర్లను ఆదేశించారు. మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించిన రిజిష్టర్లను తనిఖీ చేసి స్టాక్ నిల్వలను పరిశీలించారు. ఓ దుకాణంలో బైటాక్స్ ప్యాకట్లకు సంబంధించి ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకపోవడంతో రూ.14,800 విలువ చేసే 37 ప్యాకెట్ల అమ్మకాలను నిలిపివేయాలని డీలర్‌ను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఉదయగిరి ఏడీఏ పీ చెన్నారెడ్డి, ఉదయగిరి, మర్రిపాడు ఏఓలు రామ్మోహన్, ఆంజనేయులునాయక్ ఉన్నారు.



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బస్టాండ్ సెంటరా.. డంపింగ్ యార్డా

మర్రిపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో చెత్త పేరుకుపోయింది. చెత్తను తొలగించాల్సిన పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో బస్టాండ్ సెంటర్ కాస్తా డంపింగ్ యార్డుగా దర్శనమిస్తోంది. చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో బస్టాండ్ సెంటర్‌లో నిలబడాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎక్కడ సీజనల్ వ్యాధులు ప్రబలుతాయోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. చెత్తను తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్న



ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ



ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలపై ఆర్డీఓకు వినతులు అందజేశారు. వివిధ సమస్యలపై 40 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు.

కలిగిరిలో మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల సాగు చేపడుతున్నారు. పొగాకు రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు.

రైల్వే స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు యత్నం

- అడ్డుకున్న రైల్వే అధికారులు

బిట్రగుంట: బోగోలులోని రైల్వే స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు యత్నాలను రైల్వే అధికారులు సోమవారం అడ్డుకున్నారు. ఇటీవల వేలంలో మద్యం దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తి రైల్వే స్థలంలో ఏర్పాటుకు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి నిర్మాణాలు తొలగించారు. రైల్వే స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆశీర్వచనం

మర్రిపాడు: పెగళ్లపాడులో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కత్తెరపల్లి కొండారెడ్డి, సులోచనమ్మ దంపతుల కుమారుడు మల్లికార్జున రెడ్డి వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి, చెన్ను వెంకటేశ్వర రెడ్డి, కాశీరెడ్డి, కొండారెడ్డి ఉన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు

కావలి: రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని కావలి ఏఓ లలిత హెచ్చరించారు. మండలంలోని కొత్తపల్లిలో సోమవారం ఆమె పర్యటించారు. వరి నారు మడులను పరిశీలించారు. విత్తనాల కొనుగోలుపై రైతులను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కావలిలో విత్తనాలు కొనుగోలు చేసి నారుమడులు పోయగా మొలకెత్త లేదని ఆరోపణలు రావడంతో రైతులను విచారించినట్లు తెలిపారు. కావలిలోని ఓ డీలర్ వద్ద కొనుగోలు చేసిన కేఎన్ఎం–1638 రకం వరి విత్తనాలను మార్చుకున్నట్లుగా కొందరు రైతులు చెప్పారన్నారు. ఒక రైతు ఇంకా నారు పోయలేదని చెప్పగా మార్చుకోమని సూచించగా అందుకు అంగీకరించట్లు తెలిపారు. మరో రైతు తాను చల్లిన విత్తనాలు మొలకెత్త లేదని ఫిర్యాదు చేయగా నారుమడిని పరిశీలించామన్నారు. అనంతరం కావలిలోని విత్తన విక్రయ



విత్తనాల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ లలిత

దుకాణాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. వ్యాపారి వద్ద ఉన్న ఐదు రకాల వరి విత్తనాలను నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఫలితాలు వచ్చిన తర్వాత ఏమైనా తేడా ఉంటే దుకాణాదారుడిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్తపల్లిలో 23 మంది రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేసి నార్లు పోస్తే మొలకెత్త లేదని జరుగుతన్న ప్రచారం వాస్తవం కాదన్నారు.

భావి పౌరులకు సౌర విద్యుత్‌ను సంపదగా ఇవ్వాలి

కావలి: ప్రకృతి వనరులైన నీరు, బొగ్గు క్రమంగా తరిగిపోతున్నందున, వాటిపై ఆధారపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం రాబోయే రోజుల్లో కష్టమవుతుందని, అందుకే భావి భారత పౌరులకు నేటి తరం సౌర విద్యుత్‌ను సంపదగా ఇవ్వాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన'పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో ప్రపంచానికి వెలుగు ఇస్తున్న సూర్యుడినే నమ్ముకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవాలన్నారు. సూర్యుడిని విస్మరిస్తే చీకట్లో మగ్గిపోవాల్సిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే వారే భవిష్యత్తులో తెలివైన వారిగా తమ పిల్లల వద్ద, సమాజంలోనూ గౌరవాభిమానాలు పొందుతారన్నారు. కావలి ఈఈ కేఎస్ బెనర్జీ, కావలి, కలిగిరి డీఈలు ఏ రవికుమార్‌రెడ్డి, కృష్ణమోహన్‌బాబు, కావలి జేఈ వై వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.



కావలి :మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కలిగిరి: స్థానిక ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన'పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్‌శాఖ కావలి ఈఈ బెనర్జీ మాట్లాడుతూ ఇళ్లపై సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ఇళ్లపై సోలార్ విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకునే వారికి రాయితీని అందిస్తున్నట్లు వివరించారు. కలిగిరి ఏడీఏ కృష్ణమోహన్, ఏఈలు నాగూర్‌వలి, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉజ్వల భవితకు 'జేబీ' బాటలు

కావలి: ఎందరో పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసిన జవహర్ భారతి కళాశాల, దాని వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్)ను కావలి ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువరని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జవహర్ భారతి కళాశాలలో పూర్వ విద్యార్థి అయిన ఎమ్మెల్యేను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థిగా వచ్చిన తన లాంటి వారికి విజ్ఞానాన్ని అందించిన జేబీ



ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి సత్కారం

కళాశాల తమ మదిలో చిరస్థాయిగా ఉండిపోతుందన్నారు. కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ



కావలి: పాతూరు శివాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కావలి: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఆది దంపతులను దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. కార్తీక దీప కాంతులతో శివాలయాలు శోభిల్లాయి. భక్తుల శివనామ స్మరణతో పరిసరాలు పులకించాయి. కావలిలోని పాతూరు శివాలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి మహిళా భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. శివాలయంలో కొలువైన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. తుమ్మలపెంట తీరంలో మహిళా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సైకత శివలింగాల వద్ద కార్తీక దీపాలను వెలగించారు.

అల్లూరు: స్థానిక అల్లూరుపేటలో ఉన్న కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దేవదేవేరులను దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటవీధి రామాలయంలోని ఉపాలయంలో శివపార్వతులకు విశేష పూజలు నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని శ్రీనివాసేశ్వరాలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. కొందరు భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి చంద్రదర్శనం చేసుకుని ఉపవాస దీక్షలు ముగించారు.

చేజర్ల: కోటితీర్థం క్షేత్రంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు.


ఉదయగిరి: మండలంలోని శివాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, ఆర్లపడియ, యర్రబల్లిగడ్డతో పాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీ పరమేశ్వర ఆలయాల్లో భక్తులు రద్దీ కనిపించింది.

వరికుంటపాడు : మండలంలోని శివాలయాల్లో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే సమీపంలోని శివాలయాలకు చేరుకుని శివపార్వతులను దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. పెద్దిరెడ్డిపల్లె, వరికుంటపాడులోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

జలదంకి: మండలంలోని జలదంకి, బ్రాహ్మణక్రాక, చినక్రాకలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివపార్వతులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో దీక్ష చేపట్టారు. గురుస్వాములు అయ్యప్ప మాలధారణ చేశారు.

దుత్తలూరు: మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. దుత్తలూరులోని ఊరకొండపై కొలువైన రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కొత్తపేట, నందిపాడు, నర్రవాడలోని శివాలయాల్లోనూ విశేష పూజలు నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివపార్వతులకు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. కొమ్మిలోని పోతులూరు వీరబ్రంహేంద్రస్వామి ఆలయంలో గురుస్వాములు దాడి మాల్యాద్రి, ఎర్రజాల మాల్యాద్రి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పలకు భిక్ష నిర్వహించారు.



గండిపాళెం శివాలయంలో విశేషాలంకరణ



ఆత్మకూరు: విశేషాలంకరణలో విశ్వేశ్వరస్వామి



కొండాపురం: అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ



ఆత్మకూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు



జలదంకిలో అయ్యప్ప భక్తుల మాలధారణ